APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి   ఎడిటర్ : సి హరికృష్ణ   ఆదివారం 20 సెప్టెంబరు 2026   సంపుటి: 01   సంచిక :115   పేజీలు : 04   వెల: 2-00/-

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు



**లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం**

**1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలని నిర్ణయం**

**ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం**

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు మిగతా..2లో

## దానం నాగేందర్‌పై కోర్టు తీర్పు... కేసీఆర్‌కు చెంపపెట్టు అన్న మహేశ్ కుమార్ గౌడ్



**తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆరేనని విమర్శ**

**ప్రభుత్వాలను కూల్చివేయడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆగ్రహం**

**దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని మండిపాటు**

**ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ధీమా**

హైదరాబాద్: దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కు చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని ప్రవేశపెట్టిందే కేసీఆర్ అని తీవ్రంగా విమర్శించారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఎన్నిక జరిగితే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "గతంలో టీడీపీ టికెట్‌పై గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను, మిగతా..2లో

## మోదీ, గడ్కరీలకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్




- కొప్పర్తి-కడప బైపాస్ రహదారికి రూ. 304 కోట్లు కేటాయించిన కేంద్రం
- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎంతో సహకరిస్తోందన్న పవన్ కల్యాణ్
- ఈ ప్రాజెక్టు కారణంగా రాయలసీమలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని వెల్లడి

అమరావతి : కడప జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్‌ను కడప బైపాస్‌తో అనుసంధానించే

## నా జీవితం ధన్యమైంది - మీరు ఉండే ఇళ్లపై

# ఇక సర్వహక్కులు మీవే

- విశాఖలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న 28వేలకుపైగా పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను చంద్రబాబు అందించారు.
- లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు అందించి సుభాకాంక్షలు తెలియజేశారు.
- పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను అందించిన సీఎం చంద్రబాబు



అమరావతి : కూడు, గూడు, గుడ్డ అనే ఎన్టీఆర్ నినాదాన్నే తాము విధానంగా మార్చుకుని పేదలందరికీ నివాస వసతి కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న 28 వేలకుపైగా పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను చంద్రబాబు అందించారు. లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు అందించి సుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా..2లో


## స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం.. 100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం



- ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనేది ముఖ్యం కాదన్న మనోహర్
- కచ్చితంగా విజయం సాధించే స్థానాల్లో పోటీ చేయడమే ముఖ్యమని వ్యాఖ్య
- పవన్ కల్యాణ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నారని వెల్లడి

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని, వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాలు సాధిస్తామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఈరోజు పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. అభ్యర్థుల ఎంపికలో ఏవైనా పొరపాట్లు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పార్టీ అధిష్ఠానం మిగతా..2లో

## భూటాన్‌లో భూకంపం.. 4.9 తీవ్రతతో కంపించిన భూమి.. అసోంలోనూ ప్రకంపనలు




- భూటాన్ ఈశాన్య ప్రాంతంలో శనివారం సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించింది.
- ఈశాన్య భూటాన్‌లోని అనేక ప్రాంతాల్లో ఈ భూకంపం నమోదైంది.

ఢిల్లీ : భూటాన్‌లో శనివారం భూకంపం సంభవించింది. 4.9 తీవ్రతతో భూమి కంపించింది.

## కీలక బిల్లుపై అమెరికా అధ్యక్షుడి సంతకం.. భారత్, చైనాలపై సుంకాలకు ట్రంప్‌కు ఫుల్ పవర్..!

- రష్యా, ఇరాన్, చైనా, భారత్ లను ఒకేసారి దెబ్బతీసే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు.
- భారత్ చైనా తో సహా 10 దేశాలు ఆంక్షల పరిధిలోకి వచ్చాయి.



ఢిల్లీ : దాంతో రష్యా, ఇరాన్ లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం కొనసాగిస్తోన్న భారత్, చైనాల పై సుంకాల మోత మోగించేందుకు అధ్యక్షుడికి అధికారం దఖలు పడింది. 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' పేరుతో తీసుకొచ్చిన బిల్లుకు బుధవారం సభ 262-159 ఓట్లతో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును గత నెలలోనే సెనెట్ ఆమోదించింది. ఇప్పుడు ట్రంప్ సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది. దాంతో భారత్ చైనా తో సహా 10 దేశాలు ఆంక్షల పరిధిలోకి వచ్చాయి. భారత్ అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై ట్రంప్ సర్కార్ భారీగా సుంకాలు విధించనుంది. ఈ చట్టంపై ఇప్పటికే భారత్ స్పందించింది. రష్యాపై ఆంక్షలను, తమపై సుంకాలను విధిస్తే అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు ముప్పు తప్పదని భారత్ హెచ్చ రించింది. అమెరికా చర్యను చైనా తిరస్కరించింది. మిగతా..2లో

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో

# యువతకు కొత్త అవకాశాలు

### రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ

- 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ
- దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా



ఢిల్లీ : 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. కొత్త మార్కెట్లకు మిగతా..2లో

## ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు




- శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం
- గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు
- రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం
- నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ

## వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు

# పేరు సూచించండి

- వరంగల్ మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని రేవంత్‌రెడ్డి కోరారు.
- మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలకు ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు.



హైదరాబాద్ : వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే 2 ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే.

### కొత్త గేట్‌వే విమానాశ్రయం

మామునూరులో రానున్న మిగతా..2లో

## వికసిత్ భారత్ లక్ష్యంలో తెలంగాణ కీలక పాత్ర




- తెలంగాణ ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వం భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది.
- 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంతో పాటు..
- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళికలు రూపొంది స్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 19: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం..

# 100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం

దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, స్థానిక వార్డుల వారీగా బలమైన నాయకత్వాన్ని సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనే సంఖ్య కంటే, గెలిచే బలం ఉన్న స్థానాల్లో నిలబడి కచ్చితమైన విజయం సాధించడమే ప్రాధాన్యమని స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇవాల్టి నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నారని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాజకీయాల్లో అనుభవమే అసలైన పాఠమని పేర్కొంటూ, జీవీఎంసీ పరిధిలో గతంలో గెలిచిన, రెండో స్థానంలో నిలిచిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేవలం టికెట్ వస్తే సరిపోదని... ప్రజల అవసరాలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం కేడర్ నిరంతరం శ్రమించాలని నిర్దేశించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యత వల్లే రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కొండంత భరోసా లభించిందని, ఉత్తరాంధ్రకు వస్తున్న భారీ ప్రాజెక్టులే దీనికి నిదర్శనమని చెప్పారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందని తెలిపారు.

## మోదీ, గడ్కరీలకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

నూతన రహదారి నిర్మాణ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టు మంజూరుతో పాటు రూ. 304.44 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధానమంత్రి మోదీకి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర మౌలిక వసతుల కల్పనకు, పారిశ్రామిక పురోగతికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం అభినందనీయమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో కొప్పర్తి అత్యంత కీలకమైన నోడ్‌గా ఉందన్న ఆయన... కొత్తగా నిర్మించే అనుసంధాన రహదారి అందుబాటులోకి వస్తే పారిశ్రామిక సరుకు రవాణా మరింత వేగవంతం, సులభతరం అవుతుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఫలితంగా రాయలసీమ ప్రాంతంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో పాటు, భారీ స్థాయిలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, వాణిజ్య కార్యకలాపాలు పెరిగి రాయలసీమ ముఖచిత్రం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వికసిత్ భారత్ లక్ష్యంలో తెలంగాణ కీలక పాత్ర

రాష్ట్రం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం తెలంగాణ వాటా ఉన్న స్థాయి నుంచి 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందుకోసం కేవలం ప్రభుత్వ రుణాలపై ఆధారపడే విధానానికి పరిమితం కాకుండా ప్రైవేట్, సంస్థాగత పెట్టుబడులను పెద్ద ఎత్తున సమీకరించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను తీసుకురావడంతో పాటు యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని, వారి నైపుణ్యాలు, ప్రతిభను వినియోగించుకునేలా ఆర్థికాభివృద్ధి, ఉపాధి రంగాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

## కీలక బిల్లుపై అమెరికా అధ్యక్షుడి సంతకం..

## భారత్, చైనాలపై సుంకాలకు ట్రంప్‌కు ఫుల్ పవర్..!

భద్రతామండలి ఆమోదంలేని ఏ చర్యనూ ఆమోదించబోమని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పష్టంచేశారు. ఈ చట్టంతో ట్రంప్‌నకు మరిన్ని అధికారాలు లభించిన ట్లయ్యింది.రష్యా నాయకత్వంపై ఆంక్షలు విధించే అవకాశం దక్కింది. ఇంధన రంగంపై ఆంక్షల విధించవచ్చు. ఇప్పటికే ఉన్న ఆంక్షలను తప్పించుకుంటూ చమురు సరఫరాచేసే నౌకల షాడో ఫ్లీట్‌పైనా ఆంక్షలు విధించడానికి అధ్యక్షుడికి అధికారం దక్కుతుంది. రష్యా చమురు, గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించేలా ఒత్తిడి తెస్తూ భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించే అధికారం ఉంటుంది.

## భూటాన్‌లో భూకంపం.. 4.9 తీవ్రతతో

## కంపించిన భూమి.. అసోంలోనూ ప్రకంపనలు

భూకంపాల తీవ్రతను కొలిచే నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ (ఎన్‌సీఎస్) ఈ వివరాల్ని వెల్లడించింది. దీని ప్రకారం.. భూటాన్ ఈశాన్య ప్రాంతంలో శనివారం సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించింది. దీని తీవ్రత 4.9గా నమోదైంది. గ్యెల్పోలింగ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో, 5 కిలోమీటర్ల లోతున ఈ భూకంప కేంద్రం ఉంది. ఈశాన్య భూటాన్‌లోని అనేక ప్రాంతాల్లో ఈ భూకంపం నమోదైంది. అలాగే, సరిహద్దులో ఉన్న అసోంలోనూ కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనాలు వచ్చాయి. దీంతో అనేక ప్రాంతాల్లో భూమి కంపించింది. ఇటు భూటాన్‌లోనూ, అటు అసోంలోనూ నష్టానికి సంబంధించి ఎలాంటి వివరాలు నమోదు కాలేదు. ఈ భూకంపానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికి తీవ్ర నష్టం నమోదు కాకపోయినప్పటికీ.. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నట్లు భూటాన్ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు మూడు రోజుల క్రితం నేపాల్‌లో కూడా మరోసారి భూకంపం నమోదైన సంగతి తెలిసిందే. నేపాల్‌లో తాజాగా 4.5 తీవ్రతతో భూకంపం నమోదు కాగా.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు.

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్,

# రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్‌చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

## దానం నాగేందర్‌పై కోర్టు తీర్పు...

## కేసీఆర్‌కు చెంపపెట్టు అన్న మహేశ్ కుమార్ గౌడ్

కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన సబిత ఇంద్రారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చింది కేసీఆర్ కాదా?" అని ప్రశ్నించారు. కేసీఆర్ చర్యల వల్లే రాష్ట్రంలో ఫిరాయింపుల సంస్కృతి పెరిగిపోయిందని ఆరోపించారు. అదే సమయంలో బీజేపీపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రభుత్వాలను కూల్చివేయడం, పార్టీలను చీల్చడం బీజేపీకి అలవాటని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్, బీజేపీ ఇద్దరూ ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

## కారులో 500 పైగా బంగారు నాణేలు

# స్వాధీనం చేసుకున్న పోలీసులు

జమ్ముకశ్మీర్‌లో వాహన తనిఖీల్లో 500కు పైగా బంగారు నాణేలు స్వాధీనం

ఇద్దరు పురుషులు, ఓ మహిళను అదుపులోకి తీసుకున్న భద్రతా బలగాలు

ఢిల్లీ : జమ్ముకశ్మీర్ లో భద్రతా బలగాల తనిఖీల్లో భారీగా బంగారు నాణేలు పట్టుబడ్డాయి. అనంత్ నాగ్ జిల్లాలోని మిర్ బజార్ ప్రాంతంలో ఓ కారులో తరలిస్తున్న 500కు పైగా బంగారు నాణేలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు పురుషులు, ఓ మహిళను అరెస్ట్ చేశారు. నాణేలు ఎక్కడి నుంచి వచ్చాయి? వాటిని ఎక్కడికి తీసుకెళ్తున్నారు? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మీర్ బజార్ సమీపంలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పీూ09జూ0541 నంబర్ కలిగిన మారుతి సుజుకి జాజ్ ఎశ కారును భద్రతా సిబ్బంది ఆపారు. ఆ సమయంలో కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. కాజీగుండ్ నుంచి శ్రీనగర్ వైపు వెళ్తుండగా వాహనాన్ని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీలు నిర్వహించగా కారులో పెద్ద సంఖ్యలో బంగారు నాణేలు బయటపడినట్లు వెల్లడించారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సమీపంలోని పోలీస్ పోస్టుకు తరలించారు.

500 నుంచి 600 నాణేలు

ప్రాథమిక దర్యాప్తులో భాగంగా 500 నుంచి 600 వరకు బంగారు నాణేలు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయితే నాణేల అసలు సంఖ్య, మొత్తం బరువు, వాటి స్వచ్ఛత, మార్కెట్ విలువను ఇంకా నిర్ధారించాల్సి ఉందన్నారు. నాణేలు నిజంగా బంగారంతో తయారైనవేనా? వాటి వెనుక ఎలాంటి లావాదేవీలు ఉన్నాయి? అనే అంశాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

# వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు పేరు సూచించండి

మొదటి పేజి తరువాయి

కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం కల సాకారం కాబోతోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరుగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయం కలను నిజం చేయలేకపోయిందన్న రేవంత్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారని వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం అవుతోందని స్పష్టం చేశారు. మామునూరు విమానాశ్రయం భూసేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్ల



కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణ రాష్ట్రానికి కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

పర్యావరణ అనుమతులే ఆలస్యం

రేవంత్ రెడ్డి ఇటీవల ఢిల్లీ వెళ్లిన సందర్భంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో భేటీ అయ్యారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటులో మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో సమీక్ష చేశారు. పర్యావరణ అనుమతుల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇప్పటికే ఏఏఐ అధికారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు సమర్పించిన నేపథ్యంలో త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.

# నా జీవితం ధన్యమైంది – మీరు ఉండే ఇళ్లపై ఇక సర్వహక్కులు మీవే

మొదటి పేజి తరువాయి

వేల మంది ప్రజలకు ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తున్న ఈరోజు తన జీవితంలో మర్చిపోనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నా జీవితం ధన్యమైంది, లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూస్తున్నా. 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. మీరు ఉండే ఇళ్లపై సర్వహక్కులు ఇకనుంచి మీవే. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమం ద్వారా ఇళ్లపై హక్కులు కల్పిస్తున్నాం. పేదలకు సొంతిళ్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పని చేస్తున్నాం. సొంతిల్లు ఉండాలనేది, ప్రతి మనిషి కల. దశాబ్దాల కష్టాలు, అనిశ్చితికి నేటితో ముగింపు పలుకుతున్నాం. మీ ఇళ్లపై ఇకనుంచి వివాదం లేదు, ఎలాంటి భయం లేదు. మీ ఇళ్లపై ఇకనుంచి బ్యాంకు రుణాలు కూడా తీసుకోవచ్చు. రాజముద్ర వేసి మీకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. అభ్యంతరం లేని భూముల్లో పట్టాలు ఇస్తున్నాం. పేదలు స్వేచ్ఛగా బతకాలనే ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. ఇంకా 35 కాలనీల్లోని 10 వేల మంది పట్టాలు కోరుతున్నారు. దేవస్థానానికి చెందిన పంచగ్రామాల్లో 12,149 మందికి పట్టాలు ఇవ్వాలి. మిగతావారికి త్వరగా పట్టాలివ్వాలని అధికారులను ఆదేశిస్తున్నా. మీకు శాశ్వత చిరునామా కల్పించే బాధ్యత మా ప్రభుత్వానిది" అని సీఎం చంద్రబాబు తెలిపారు. "దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరం విశాఖ. విశాఖ త్వరలో విశ్వనగరంగా మారుతుంది. మీరంతా గర్వంగా చెప్పుకునేలా విశాఖను మారుస్తున్నాం. అల్లూరి విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయి. టూరిజం, లాజిస్టిక్స్ హబ్‌గా విశాఖ మారనుంది. పోలవరం ఎడమ కాలువ త్వరలో విశాఖకు వస్తుంది. చంద్రబాబు విశాఖకు హైవేలు, పోర్టులు, విమానాశ్రయాలు వచ్చాయి.




ఈ రెండేళ్లలో విశాఖకు 91 ప్రాజెక్టులు వచ్చాయి. ఈ విశ్వనగరంలో ప్రతి పేదవాడికీ భాగస్వామ్యం ఉండాలి."

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు'- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి

భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు. భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.

### బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం



ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

### 'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో సేవ

ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'నిరంతరం నేర్చుకుంటూనే మీరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. మీరు ఎల్లప్పుడూ మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. 'మిషన్ కర్మయోగి'ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో మీకు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. 'నాగరిక్ దేవో భవ'. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. మీ పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే మీ విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది' అని ప్రధాన మోదీ పేర్కొన్నారు.

### 51 వేల మందికి పైగా నియామక పత్రాలు

20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

# ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. "నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు.



ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

## నైరుతి రుతుపవనాల తిరోగమనం షురూ- ఈసారి దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం!

దేశాన్ని వీడుతున్న నైరుతి రుతుపవనాలు

సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి తిరోగమనం ప్రారంభం

ఈసారి దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం నమోదైందని ఐఎండీ ప్రకటన



ఢిల్లీ : భారతదేశంలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలం ముగింపు దశకు చేరుకుంది. దేశంలో రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. 2026, సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి వెళ్లినట్లు భారత వాతావరణ శాఖ (×వీఐ) తెలిపింది. సాధారణంగా సెప్టెంబర్ 17 నాటికే రాజస్థాన్ నుంచి ఈ నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, ఈ ఏడాది 2 రోజులు ఆలస్యంగా తిరోగమనం ప్రారంభమైంది. ఐఎండీ ప్రకారం రాబోయే 3 నుంచి 4 రోజుల్లో రాజస్థాన్‌లోని ఇతర ప్రాంతాలతో పాటుగా పంజాబ్, కచ్, సౌరాష్ట్రలోని కొన్ని ప్రాంతాల నుంచి కూడా ఈ రుతుపవనాలు వెనక్కి వెళ్లడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

### జూన్ 4న కేరళలోకి ఎంట్రీ- జులై 9న దేశమంతటా విస్తరణ

ఇక ఈ ఏడాది జూన్ 4న కేరళలోకి తొలుత నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. తర్వాత క్రమక్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. జులై 9 నాటికి దేశం మొత్తం రుతుపవనాలు వ్యాపించాయి. ఇప్పుడు సెప్టెంబర్ మూడో వారంలో పశ్చిమ రాజస్థాన్ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. అయితే ఈ సారి నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా వర్షపాతం ఆశించిన స్థాయిలో లేదు. ఐఎండీ డేటా ప్రకారం జూన్ 4 నుంచి సెప్టెంబర్ 19 వరకు దేశవ్యాప్తంగా చూస్తే వర్షపాతం లోటు 15 శాతంగా ఉంది. వర్షపాతం లోటు అధికంగా ఉన్న ప్రాంతాల్లో దక్షిణ ద్వీపకల్పం ఉంది. దేశంలోనే అత్యధికంగా ఇక్కడ ఏకంగా 29 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

ఒక్క జులైలోనే అధిక వర్షపాతం నమోదు

ఈ రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు జులై నెలలో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. అంటే ఈ ఒక్క నెలలోనే సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షపాతం (సర్‌ప్లస్) నమోదైందన్నమాట. జులై నెలలో సగటు సాధారణ వర్షపాతం 280.5 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది జులైలో ఏకంగా 283.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంతకుముందు జూన్ నెలలో పరిస్థితి భిన్నంగా ఉంది. వాస్తవానికి రుతుపవనాలే పలు ప్రాంతాల్లో కాస్త ఆలస్యంగా వచ్చాయంటే, వర్షాలు కూడా అంతంత మాత్రంగానే కురిశాయి. సాధారణంగా జూన్‌లో 165 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 106.8 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో జూన్ నెలలో దేశవ్యాప్తంగా చూస్తే 35 శాతం లోటు వర్షపాతం (డెఫిసిట్) నమోదైంది. గత నెల ఆగస్టులో కూడా పరిస్థితులు ఏమంత మెరుగ్గా లేవు. ఆగస్ట్ 31న ఐఎండీ నెలవారీగా విడుదల చేసే డేటా ప్రకారం చూస్తే ఆగస్టులో దేశవ్యాప్తంగా 213.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2001 తర్వాత ఆగస్ట్ నెలలో నమోదైన ఏడో అత్యల్ప వర్షపాతం ఇదే కావడం గమనార్హం.

### ఎల్‌నినో ఎఫెక్ట్‌తోనే లోటు వర్షపాతం

ఈ 2026 ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షపాతం తగ్గడానికి ప్రధాన కారణాల్లో పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడటం. సదర్న్ ఆసిలేషన్ అనే వాతావరణ వ్యవస్థలోని 3 దశల్లో ఈ ఎల్‌నినో ఒకటి. ఇక్కడ పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులతో పాటు ఇంకా వాతావరణ మార్పులు కూడా సంభవించే పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల వర్షపాతాలు తగ్గడమే కాకుండా వాతావరణంలో వేడి విపరీతంగా పెరుగుతుంది. సకాలంలో వర్షాలు కురవవు. అదే విధంగా అకాలంగా ఉరుములు, మెరుపులు సహా వడగండ్ల వానలకు దారితీస్తుంది. కొన్ని చోట్ల కురవాల్సిన దాని కంటే తక్కువగా, కొన్ని చోట్ల అకాలంగా కురుస్తుంటాయి. రుతుపవనాలు ముగిసే సమయంలో అకస్మాత్తుగా భారీ వర్షాలు కూడా పడే ప్రమాదం ఉందని గతంలోనే ఐఎండీ హెచ్చరించింది. ఇక ఎల్‌నినోకు వ్యతిరేకంగా ఉండే దశను లా నినా (ఞఘ చీఐఋ) అని పిలుస్తారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. మధ్యలో న్యూట్రల్ ఫేజ్ కూడా ఉంటుంది.

# శ్రీరామ్ రెడ్డి త్రాగునీటి పథకం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్





అమరాపురం, సెప్టెంబర్19,అనంత సూర్య న్యూస్:మండల పరిధిలోని హాలుకూరు వద్ద శ్రీరామరెడ్డి త్రాగునీటి పథకం పంపు హౌస్ లను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ శనివారం పరిశీలించారు.ప్రజలకు త్రాగునీటిని అందించాలనే సంకల్పంతో పి ఎ బి ఆర్ శ్రీరామ్ రెడ్డి త్రాగునీటి ప్రాజెక్టును ఏర్పాటు చేస్తే అస్తవ్యస్తంగా ఉండడంతో సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపులను ఏండ్లు గడిచిన శుభ్రం చేయక, ముఖ్యంగా వాటర్ క్వాలిటీ టెస్ట్ చేయకుండా త్రాగునీరును ప్రజలకు అందిస్తే ఎలా అని సంబంధిత అధికారులను జిల్లాకలెక్టర్ ప్రశ్నించారు.త్రాగునీటి పథకమునకు వాడిన పైపుల క్వాలిటీని సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ ఈఈ మురళీధర్, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ మనునాయక్, శ్రీరామ్ రెడ్డి ట్రంక్ మెయిన్ డి ఈ శిరీష,సంబంధిత కాంట్రాక్టర్ ఆడప వెంకటరావు తదితరుల సమక్షంలో పరిశీలించారు. అదేవిధంగా కళ్యాణదుర్గం నుండి హిందూపురం వరకు ఎంత సామర్థ్యంలో త్రాగునీరు సప్లై అవుతుందనే దానిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ లీకేజీ పనులను వర్కర్ల ద్వారా చేస్తున్నారా, పంప్ స్టేషన్ నందు ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారు, ముఖ్యంగా పంపు లాంగ్ డైరీని కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యంగా ఫ్లోమీటర్లను పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేయాలని, విద్యుత్ రీడింగ్ వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించడంతోపాటు ఇప్పటివరకు దీనికి సంబంధించిన రికార్డుల జిరాక్స్ కాపీలను అందజేయాలని సంబంధించిన శ్రీరామ్ రెడ్డి ట్రంక్ మెయిన్ డి ఈ శిరీషను ఆదేశించారు.అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేని కారణంగా,సంబంధిత కాంట్రాక్టర్,సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు సక్రమంగా త్రాగునీరు అందడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.విధులకు సక్రమంగా హాజరు కాక, గ్రామాలకు త్రాగునీరు అందించకపోతే సంబంధిత సిబ్బందికి జీతాలు ఎలా ఇవ్వాలని,పనిచేయని సిబ్బందిని తక్షణం తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.పంప్ హౌస్ లో ప్యానెల్ బోర్డులు మరియు మోటార్ల వద్ద పైపులకు బట్టల చుట్టి సరియైన సౌకర్యాలు లేకుండా ఏండ్ల తరబడి ట్యాంకులను క్లీన్ చేయకుండా వాటర్ క్వాలిటీ టెస్టును చేయాల్సి ఉండగా పరీక్షలు నిర్వహించకుండా ప్రజలకు త్రాగునీరు ఇస్తే ఎలా అని సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసులు అందజేయాలని అధికారులను ఆదేశించారు.పంప్ హౌస్ లో విద్యుత్తు సౌకర్యం కూడా అంతంత మాత్రమే ఉందని విద్యుత్ దీపాలు కూడా లేని పంపు హౌస్ నందు రాత్రి వేళల్లో విధులు ఎవరు నిర్వహించరా? అని ప్రశ్నించారు.ముఖ్యంగా ఓపెన్ గా భారీ సామర్థ్యం గల సంపులకు నీటి సప్లై ని సూర్యరశ్మి పడే విధంగా చేపట్టడం ద్వారా వ్యర్థ పదార్థాలు పడి ప్రజలకు కలుషిత త్రాగునీరు అందిస్తే అనారోగ్యం పాలవుతారని తక్షణం దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అందజేయడంతో పాటు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇదివరకే నోటీసులు ఇచ్చామని సంబంధిత డి ఈ కలెక్టర్ కు వివరించగా దానికి సంబంధించిన జిరాక్స్ పత్రాలు ఎక్కడా అని కలెక్టర్ అడగడంతో సమయం అధికారి వివరాలు అందించకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణం కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసి దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రజలకు శ్రీరామరెడ్డి పథకం ద్వారా త్రాగునీరును ప్రతి గ్రామాలకు అందించేందుకు సత్వరమే కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.సక్రమంగా విధులు నిర్వహించని కాంట్రాక్టర్ను,సిబ్బందిని తొలగించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హనుమంతు,ఎంపీడీవో రామారావు,ఆర్డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న "డయల్ యువర్ కలెక్టర్"

## ప్రజలు తమ త్రాగునీటి సమస్యల పరిష్కారం కోసం

## కలెక్టర్ గారి ఫోన్ నంబర్ 9032020868 కు సంప్రదించవచ్చు



పుట్టపర్తి,సెప్టెంబర్ 19, అనంత సూర్య న్యూస్:శ్రీ సత్యసాయి జిల్లా ప్రజల త్రాగునీటి సమస్యలను నేరుగా తెలుసుకుని,వాటికి సత్వర పరిష్కారం కల్పించేందుకు ఈ నెల 21వ తేదీ సోమవారం ఉదయం 10.00 గంటల నుండి 10.30 గంటల వరకు "డయల్ యువర్ కలెక్టర్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిఆర్ఓ కొండయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏ గ్రామం, మండలం లేదా పరిసర ప్రాంతాల్లో త్రాగునీటికి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే, ప్రజలు నేరుగా జిల్లా కలెక్టర్ ఫోన్ నంబర్ 9032020868 కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి,తగిన చర్యలు తీసుకుని సత్వర పరిష్కారం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుందని తెలిపారు.కావున జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఆ భూమి మా బంధువులదే..

- పత్రాలు పరిశీలిద్దాం.. నిజాలు తేల్చుదాం !
- బుడగ జంగాల అంజికి చితంబర దొర, బీకేఎస్ ఆనంద్ సవాల్



అనంతపురం, సెప్టెంబర్ 19 అనంత సూర్య : బుడగ జంగాల అంజి తనది కాని భూ వివాదంలో బాధితులను రెచ్చగొడుతూ అసత్య ఆరోపణలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నాడని భూ యజమానులు చితంబర దొర, బీకేఎస్ ఆనంద్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. బుడగ జంగాల అంజి చెబుతున్న స్థలం తమ బంధువులదేనని, 40 ఏళ్ల కిందట ఏకుల రత్నమ్మ పేరుపై డైక్లాట్‌లో ఉందని, కోర్టు కూడా తమకు అనుకూలంగానే తీర్పు ఇచ్చిందన్నారు. అవసరమైతే ప్రజా సంఘాలు, అధికారులతో కూడిన నిజ నిర్ధారణ కమిటీ వేసి ఇరుపక్షాల పత్రాలను పరిశీలించేందుకు నిజ నిజాలు తేల్చేందుకు నీవు సిద్ధమా ? అంటూ సవాల్ విసిరారు. 75/4 సర్వే నెంబర్ భూమిలో తమకు అన్ని పత్రాలు ఉన్నాయని, అయితే వీరు మరో సర్వే నెంబర్‌లో భూమి కొనుగోలు చేసి రెండింటి మధ్య వివాదాన్ని లేవనెత్తి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను బాధితులకు మరోలా తప్పుదోవ పట్టిస్తూ.. తమకు పూర్వం నుంచి వచ్చిన ఆస్తిపై వివాదాలు రేకెత్తిస్తున్నారని విమర్శించారు. వారు కొనుగోలు చేసిన భూ సర్వేనెంబర్‌కు మాకు చెందిన భూ సర్వేనెంబర్‌కు ఎలాంటి సంబంధం లేకున్నా.. బుడగ జంగాల అంజి పనికట్టుకుని బాధితులందరినీ తమవైపు ఉసగోల్పుతూ తమది కాని భూమిని చేజిక్కించుకునేందుకు కుట్ర పన్నుతున్నారని, ఇది ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకునేందుకు నిజ నిర్ధారణ కమిటీ పత్రాల పరిశీలనకు వేదిక నువ్వు చెప్పినా సర్వే.. మేం చెప్పినా సరే.. అందుకు నీవు సిద్ధమా ? అని నువ్వే తేల్చుకోవాలని సవాల్ విసిరారు. సమావేశంలో మురళి, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ చంద్రమోహన్, జిల్లా వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోగుల నాగభూషణం, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

# మన ఆరోగ్య భద్రత కోసం.. స్వర్ణాంధ్ర - స్వచ్ఛంద్ర

## - సామాజిక అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ ప్లారెన్స్ దీప



అనంతపురం, సెప్టెంబర్ 19 అనంత సూర్య : స్వర్ణాంధ్ర,- స్వచ్ఛంద్ర కార్యక్రమం సామాజిక ఆరోగ్యం కోసం, పరిశుభ్రమైన వాతావరణం కోసం మాత్రమే కాకుండా రేపటితరం మంచి భవిష్యత్ కోసం ఉపయోగపడుతుందని సామాజిక అటవీశాఖ జిల్లా ఇంచార్జి రేంజ్ ఆఫీసర్ ప్లారెన్స్ దీప అన్నారు. శనివారం అనంతపురం నగరంలోని కెఎసఆర్ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛంద్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆనంద్, అటవీశాఖ సామాజిక వన విభాగం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ గురు ప్రభాకర్ ఆదేశాల ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సందర్భంగా కళాశాల ప్రాంగణంలో, పరిసర ప్రాంతాలలో గల చెత్త కుప్పలను తొలగించడం జరిగిందని తెలిపారు. మైదానాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటే కార్యక్రమం విద్యార్థులతో కలసి నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ నాగరత్న వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు గౌతమి, నీలవేణి, అటవీ శాఖ సిబ్బంది ప్రవీణ్, ప్రసాద్, లోకేష్, బాలన్న, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

## ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్




కదిరి,సెప్టెంబర్ 19,అనంత సూర్య న్యూస్: "ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగ్‌లు ముద్దు"అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు.కదిరి పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ ఎదురుగా నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు,ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి,వాటికి ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగ్‌లు, పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు."మన ఆరోగ్యం.. మన పర్యావరణం.. మన బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.కదిరి పట్టణాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రజలు,అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.స్వచ్ఛమైన కదిరి ఆరోగ్యకరమైన కదిరి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు.

# హానికరమైన ఏపీకే ఫైళ్లతో సైబర్ మోసాలతొ

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కదిరి,సెప్టెంబర్ 19, అనంత సూర్య న్యూస్:ట్రాఫిక్ చలానా,ఆర్‌టీఓ చలానా పేరుతో వచ్చే నకిలీ లింకులు,హానికరమైన ఏపీకే ఫైళ్ల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్యసాయి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పనింద్ర కుమార్ సూచించారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను మొబైల్‌లోకి దింపుకొని ఏర్పాటు చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం,బ్యాంకు ఖాతా వివరాలు, ఒకసారి మాత్రమే ఉపయోగించే సంకేత సంఖ్యలు తదితర సున్నితమైన సమాచారం మోసగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. అనుమానాస్పద లింకులపై నొక్కకూడదని,రహస్య సంకేత సంఖ్య,వ్యక్తిగత గుర్తింపు సంఖ్య,కార్డు భద్రతా సంఖ్య,బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు.సైబర్ మోసానికి గురైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ నేరాల సహాయవాణికి ఫిర్యాదు చేయాలని తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక భద్రతా పథకాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు, రైతులు,వీధి వ్యాపారులు, మహిళలు,వృద్ధులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన శిబిరాల ద్వారా సైబర్ భద్రతతో పాటు వివిధ సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత సీనియర్ కౌన్సిలర్ వీర మారుతి, నారాయణ,నీరజ మాట్లాడుతూ అనుమానాస్పద లింకులు లేదా ఏపీకే ఫైళ్లు వచ్చినప్పుడు తొందరపడి తెరవకుండా, వాటి నిజానిజాలను నిర్ధారించుకున్న తర్వాతే చర్యలు తీసుకోవాలని సూచించారు.

# నూతన విద్యుత్ సబ్ స్టేషన్ కొరకు స్థలాన్ని పరిశీలించిన కూటమి నాయకులు



ముదిగుబ్బ,సెప్టెంబర్ 19,అనంత సూర్య న్యూస్:రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గం పరిధిలో ముదిగుబ్బ మండలంలోని గుంజే పల్లి గ్రామ కన్యకల గొంది దేవాలయం నందు నూతన విద్యుత్ సబ్ స్టేషన్ కోసం శనివారం స్థలాన్ని పరిశీలించిన కూటమి నాయకులు.ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ తహసిల్దార్ ఉమామహేశ్వర్ రెడ్డి, కూటమి నాయకులు, ముదిగుబ్బ ఎంపీపీ, బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడ్డు మర్రి ఆదినారాయణ యాదవ్,ముదిగుబ్బ మండల తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కారణం ప్రభాకర్ నాయుడు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# "పరిశుభ్రతే ఆరోగ్యానికి తొలి అడుగు"

## ఘనంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



ఎన్.పి.కుంట, సెప్టెంబరు 19,అనంత సూర్య న్యూస్:ఎన్ పి కుంట మండల పరిధిలోని 14 గ్రామపంచాయతీల్లో శుక్రవారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్లను గుర్తించి శుభ్రం చేశారు.ధనియానిచెరువు, ఎన్.పి.కుంట గ్రామాల్లో విద్యార్థులకు పరిశుభ్రత, చెత్తను నాలుగు రకాలుగా విభజించడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎన్.పి.కుంట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులకు పారిశుద్ధ్యం,వ్యర్థాల విభజనపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎంపీడీవో,డిప్యూటీ ఎంపీడీవో,పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా చట్టాలు న్యాయ సలహాలపై అవగాహన



కొత్తచెరువు,సెప్టెంబర్ 19,అనంత సూర్య న్యూస్: టెంబక్రిల్ కలెక్టివ్ ఆర్థిక సహకారంతో మహాశక్తి సమైఖ్య ఆదిశక్తి సొసైటీ ఆధ్వర్యంలో మహిళా చట్టాలు న్యాయ సలహాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కొత్తచెరువు మండల పరిధిలోని తలమర్ల గ్రామంలో సొసైటీ అధ్యక్షులు సుజాత, సీఈవో కవిత,ఆదిశక్తి సొసైటీ ఆధ్వర్యంలోఉచిత న్యాయ సేవా సదస్సును నిర్వహించారు.ముఖ్యంగా గృహహింస చట్టంపై నాటిక రూపంతో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహిళలు చట్టం గురించి అవగాహన చేసుకొని వారి సమస్యలను, ఎదుర్కొంటున్న హింసను,తగ్గిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలోమహాశక్తి సీఈఓ రవీజాబీ, మహాశక్తి పాలకవర్గం, (గ్రా మంలోని మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్, భూ సమస్యలపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఫోకస్

## తన దృష్టికి వచ్చిన వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశం



అనంతపురం, సెప్టెంబర్ 19 అనంత సూర్య : గ్రామాల్లో విద్యుత్, భూ సమస్యలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు ఓపిగ్గా విన్నారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ రాజ్, పింఛన్లు వంటి వాటి మీద అర్జీలు వచ్చాయి. కొన్ని చోట్ల విద్యుత్ సమస్య ఉందని చెప్పడంతో వెంటనే అధికారులతో మాట్లాడారు. అసలే నీరు తక్కువగా ఉందని.. వ్యవసాయానికి అంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సమస్య తెలిసిన వెంటనే విద్యుత్ సిబ్బంది స్పదించాలన్నారు. భూముల సమస్యలపై కూడా ఎమ్మెల్యే సునీత ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. కింది స్థాయిలో పరిష్కరించదగ్గ వాటిపై కూడా నిర్లక్ష్యం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏ విభాగంలో సమస్య పరిష్కారమవుతుందనేది చూడాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలన్నింటికీ పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందులో రెవెన్యూ, విద్యుత్ సమస్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశిలిస్తున్నట్టు చెప్పారు. ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి రాకుండా చేస్తున్నామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పింఛన్ల చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారని.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేసే బాధ్యత తీసుకుంటామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు..

### రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్యకర్త కుటుంబానికి సాయం

రోడ్డు ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే సునీత చొరవతో ఆర్థిక సాయం అందింది. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన జి.సుధాకర్ రెడ్డి నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే స-ునీత సీఎం చంద్రబాబు, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. వారి కుటుంబ పరిస్థితి వివరించగా.. వారు తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 1లక్ష 50వేల రూపాయలను మంజూరు చేశారు. శనివారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో సుధాకర్ రెడ్డి సతీమణి రాణికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే సునీత కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ పర్యటన

## ఏర్పాట్ల భద్రతను పరిశీలించిన డిఎస్పి



అనంతపురం, సెప్టెంబర్ 19 అనంత సూర్య : ఐటి విద్యాశాఖ మంత్రి, టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనంతపురం డిఎస్పి చంద్రశేఖర్ రాప్తాడులో లోకేష్ పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ తో కలిసి ఆయన లోకేష్ ర్యాలీ నిర్వహించబోయే ప్రాంతాలు, విగ్రహావిష్కరణ, పార్టీ కార్యకర్తల సమావేశం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక పోలీసులకు భద్రతకు సంబంధించిన పలు సూచనలను డిఎస్పి చేశారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ టీం కూడా రాప్తాడులో పర్యటించారు. ఈనెల 22న లోకేష్ పాల్గొనబోయే కార్యక్రమాలు అన్నింటి వివరాలు తెలుసుకున్నారు. ఎక్కడెక్కడ పర్యటిస్తారు.. ఏ సమయానికి వస్తారు.. వంటి అంశాల గురించి శ్రీరామ్ తో పాటు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పార్టీ శ్రేణులకు కొన్ని సూచనలు కూడా లోకేష్ టీం చేసింది. రాప్తాడు పర్యటనకు సంబంధించి దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈ సందర్భంగా శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలిరానున్నారని ఆయన చెప్పారు.

# మంత్రి నారా లోకేష్ పర్యటనపై గ్రామ గ్రామాన చర్చ

## ప్రతి గ్రామం నుంచి తరలివచ్చేలా శ్రేణులు సన్నాహకాలు

## లోకేష్ పర్యటనను విజయవంతం చేద్దామన్న పరిటాల సునీత



అనంతపురం, సెప్టెంబర్ 19 అనంత సూర్య : ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాప్తాడు నియోజకవర్గ పర్యటనపై గ్రామ గ్రామాన చర్చ మొదలైంది. లోకేష్ పర్యటనకు తరలివచ్చేలా టీడీపీ శ్రేణులు భారీగా సన్నాహకాలు చేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే పరిటాల సునీత అనంతపురం రూరల్, ఆత్మకూరు మండల నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈనెల 22న మంత్రి లోకేష్ పర్యటనకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే సునీత వివరించారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని.. నాయకులు ఎమ్మెల్యేతో అన్నారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో ఎన్టీఆర్ తో పాటు పరిటాల రవీంద్ర విగ్రహాల ఆవిష్కరణ ఉండటంతో చాలా మందిలో ఆసక్తి ఏర్పడిందన్నారు. ఆ కార్యక్రమం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ పర్యటనకు ఎంత మంది వచ్చినా అందుకు తగిన విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యకర్తలను గ్రామం నుంచి తీసుకొచ్చి.. తిరిగి వారు ఇంటికి చేరే వరకు నాయకులే బాధ్యత తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో పార్టీ ఎంత బలంగా ఉందనేది.. ఈ పర్యటన ద్వారా తెలియజేద్దామని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# చిన్నారి అశ్వర్థ గుణదత్తకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న కర్నూలు జిల్లాకు చెందిన చిన్నారి
- ఒక నెల వేతనానికి సంబంధించిన చెక్కును అందజేసిన ఎమ్మెల్యే




అనంతపురం, సెప్టెంబర్ 19 అనంత సూర్య : అరుదైన వ్యాధితో బాధపడుతున్న మూడేళ్ల అశ్వర్థ గుణదత్తకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన నెల రోజుల వేతనాన్ని సాయంగా అందజేశారు. కర్నూలు జిల్లాకు చెందిన హరీష్ కుమార్, నవ్యశ్రీ దంపతులకు ఇద్దరు సంతానం కాగా పెద్దకుమారుడు అశ్వర్థ గుణదత్త(3)కు జన్యుపర అరుదైన వ్యాధి సోకింది. ఈ వ్యాధి కారణంగా కండరాలు బలహీనమై నిల్చోలేని, కూర్చోలేని పరిస్థితి. ఖరీదైన ఇంజెక్షన్ వేయించాలని, లేకపోతే చిన్నారికి ఇవ్వకపోతే ప్రాణానికే ప్రమాదం అని వైద్యులు తెలిపారు. సామాజిక మాధ్యమం ద్వారా ఈ సమాచారాన్ని తెలుసుకున్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గతంలోనే స్పందించారు. చిన్నారి వైద్య ఖర్చులకు నెల జీతం అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి ఆ చిన్నారి తాతయ్య పుల్లయ్యకు తన నెల రోజుల వేతనానికి సంబంధించిన చెక్కును అర్బన్ టిడిపి కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అందజేశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. భవిష్యత్ ఆ చిన్నారికి మరింత సాయం అందేలా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు.

# ప్రజలు సహకరిస్తేనే.. స్వచ్ఛ అనంత సాధ్యం : ఎమ్మెల్యే దగ్గుపాటి





అనంతపురం, సెప్టెంబర్ 19 అనంత సూర్య : ఇక నుంచి నగరంలో మారుమూలన ఉన్న ఇంటి వరకు చెత్త తరలించే ఎలక్ట్రానిక్ వాహనాలు వస్తాయని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం నగరపాలక సంస్థకు ప్రభుత్వం కేటాయించిన ఈ-ఆటోలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్, ఎంహెచఓ రాజా రవీంద్ర చౌదరితో పాటు మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థకు మొత్తం 62 వాహనాలను ప్రభుత్వం కేటాయించగా.. తొలి విడతగా 15 వాహనాలు వచ్చాయి. వీటిని ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనతో కాలుష్య రహిత చెత్త వాహనాలను తీసుకొచ్చారన్నారు. ఈ-వాహనాల ద్వారా నగరంలో చిన్న చిన్న సందుల్లో కూడా వెళ్లే సౌలభ్యం ఉంటుందన్నారు. ప్రజలంతా సహకరించి ఈ-వాహనాలకు చెత్త అందజేయాలని కోరారు .గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కోటి 50 లక్షల టన్నుల చెత్తను పెట్టి పోయిందని విమర్శలు చేశారు. దీనిని తొలగించేందుకు గత అక్టోబర్ రెండవ తేదీ నుంచి చర్యలు చేపట్టారని.. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్ల చెత్త నిలువలు లేకుండా చేశారన్నారు. అనంతపురం నగరంలో డంపింగ్ యార్డ్‌లో మూడు లక్షల టన్నుల చెత్త పెట్టి పోయారని.. ఇప్పటికి రెండు లక్షల టన్నుల చెత్తను తొలగించామని, త్వరలోనే మిగిలింది కూడా పూర్తి చేస్తామన్నారు. ఇదే స్థానంలో 15 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ తీసుకొస్తామని చెప్పారు. దీని ద్వారా తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా శుద్ధి చేసి.. ఎరువుగాను, సిమెంట్ పరిశ్రమలకు తరలించే విధంగా చూస్తామన్నారు. అదే సమయంలో ఇక్కడ ఒక అందమైన పార్కును కూడా తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో ప్రజా వ్యవస్థను మొత్తం నాశనం చేసి వెళ్లిపోయారని.. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న తర్వాత అన్నింటిని మళ్లీ గాడిలో పెట్టారన్నారు. వెనుకబడిన రాయలసీమను రైజింగ్ రాయలసీమగా మారుస్తూ ప్రాంతానికి అనుగుణంగా పరిశ్రమలు తీసుకొస్తున్నారని.. ఇప్పటికే నాలుగు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను కూడా పూర్తి చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. మరోవైపు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో ఏ కార్యక్రమైనా.. అది ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రారంభమవుతుందని.. ముఖ్యమంత్రులు చంద్రబాబుకు ఉన్న విజన్‌కు నిదర్శన-మన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ కాలుష్యరహితంగా ఉండేవిధంగా ఎలక్ట్రానిక్ వాహనాలను తీసుకొచ్చారన్నారు.



ఈ-వాహనాలు మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి చెత్త సేకరిస్తాయన్నారు. ప్రజలంతా దీనికి సహకరించాలన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర పేరుతో ప్రతివారం వినూత్నమైన కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా ఈ నెల 17 నుంచి నెలరోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో అనంతపురం ఒక స్వచ్ఛమైన, సుందరమైన అనంతగా మారుతోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ డైరెక్టర్లు భవాని రవికుమార్, పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, పోతుల లక్ష్మీనరసింహులు, టిడిపి నగర అధ్యక్షులు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఎం బాషా ఇంటికి టీడీపీ ముఖ్య నేతలు



అనంతపురం, సెప్టెంబర్ 19 అనంత సూర్య : గత కొన్ని రోజులుగా వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్న టీడీపీ మైనార్టీ నాయుడు ఐఎంఎం బాషా ఇంటికి పార్టీ ముఖ్యనాయకులు వెళ్లారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మైనార్టీ టిడిపి నాయకులు శనివారం బాషా ఇంటికి వెళ్లి మాట్లాడారు. బాషా నాయకులతో తన సమస్యల గురించి చెప్పుకున్నారు. పార్టీ కోసం చాలా ఏళ్ల నుంచి కష్టపడుతున్నానని.. ఆర్థికంగా కొంత ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. తనకు 3 వ్యక్తిగత కేసులు ఉన్నాయని, వాటికి తనకు ఎలాంటి సంబంధం లేదని బాషా తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పందిస్తూ.. చట్టపరంగా సాధ్యమైన పరిష్కార మార్గాలు చూపిస్తామన్నారు. అలాగే ముస్లిం మైనార్టీలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని.. గత ఎన్నికల ముందు చెప్పామన్నారు. దీనిపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు బాషాకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆర్థికపరమైన అంశాలన్నింటికీ సాయం చేస్తామన్నారు. అలాగే ఇళ్ల పట్టాల అంశంపై ఇప్పటికే పరిశీలన జరుగుతోందని.. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే మైనార్టీలకు కచ్చితంగా పట్టాలు ఇస్తామన్నారు. సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంతో బాషా సంతృప్తి వ్యక్తం చేశారు. తనకు పార్టీపై కానీ, నాయకులపై ఎలాంటి చెడు అభి్ర-పాయం లేదన్నారు. తాను పార్టీకి విధేయుడిగానే ఉంటానని బాషా తెలిపారు. ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు మా ఇంటికి వచ్చి నాతో మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలార్ భాష, మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయితీ గౌస్‌మోద్దిన్, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మహమ్మద్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405